# స్వామివారి ఉత్సవం

అడపాతడపా యింకా తుప్పర పడుతూనేవుంసి. నేలంతా తడిసి బురద బురదగావుంది. రాత్రిపూట కూడా పెద్దవాన కురిసే వుంటుంది. అంత క్రొత్తచోటు.

గోపాలస్వామి గుడి వుంది. ఉత్సవాలు చూడటానికి ఎక్కడెక్కడ జనం పని కట్టుకుని వచ్చివాలుతారు. అప్పటికే జనం కిక్కిరిసి పోతున్నారు. ఉండటానికి చోటు కనిపించటంలేదు. అదేమీ అంత పెద్ద వూరుకాదు. ఏ హోటలులోనో బస చెయ్యటానికి, ఎవరైనా ఎరుగున్నవాళ్ళుంటే వుండిపోవటం, అది వీలుపడకపోతే అవీ యివీ తెచ్చుకుని వంటపెట్టడం, ఏ పరిచితులు యెవ్వరూలేరు. స్వయం పాకం అంతకంటే చేతకాదు. తీరా యీ వూరు వచ్చిపడిన తర్వాత ఏదో మార్గం అన్వేషించాలసే వస్తుంది. అంతేగాని వెనక్కు తిరిగి వెళ్ళం కదా!

తీవ్రంగా ఆలోచించుకుంటున్నాను. చూచాయగా తెలిసింది. ఇక్కడే యెవరో డబ్బు పుచ్చుకుని భోజనం పెడతారని, ఎవరో పుణ్యాత్ముడు ఆ పూటకూళ్ళమ్మ యిల్లు చూపించాడు.

మండువా యిల్లు. ముందూ వెనకా ఖాళీస్థలం, ఆ కాస్త ఆవరణ

లోనే పూల మొక్కలు, రకరకాల కాయగూరలు—ఆ తోటను యెంతో శ్రద్ధగా పెంచుతున్నట్లు కనిపిస్తోంది. మండువా యిల్లు అవటంవలన లోపల కావలసినంత వెలుతురు. అయిదారు గదులున్నట్లున్నాయి. ఆ గదుల్లో యెవరెవరో వున్నారుకూడా పూటకూళ్లమ్మ నాకు ఖాళీ లేదని చెప్పి, బాటసార్లను యిరకాటంలో పెట్టడం మా కిష్టం వుండదంటూ వాళ్లస్టోరు రూములో ఓ భాగంలో సర్దుకోమని చెప్పింది. 'ఏ గదైనా ఖాళీ అవుతే మీ కిస్తాను మీరు యెన్నిరోజులుంటారేమిటి' అన్నది.

'ఎన్నో రోజులుకూడా యెక్కడ! స్వామివారి దర్శనంచేసుకుని వెళ్ళిపోతాను' అన్నాను.

'ఆ! స్వామివారి దర్శనం అయినట్టే, మీరు వెళ్ళినట్టే' అని నవ్వింది.

ఏమిటా వెకిలి నవ్వు అనుకున్నాను.

దొడ్లోకి దారి చూపించింది. బావి, చేద చూపించింది. నా కళ్లు కాగు, పొయ్యి కోసం వెదుకుతున్నాయి.

'ఏమయ్యా చలేస్తోందా!....చెప్పు, వేనీళ్లు యిస్తాలే' అన్నది.

ఆ మాటకు బాగా చిరాకు కలిగినా తమాయించుకుని, 'ఉంటే అట్లాగే యిప్పించండి' అన్నాను.

ఓ బిందెడు నీళ్లు అమాంతం తెచ్చి దొడ్లో పడేసింది. 'అదుగో బిందెలోనే చెంబుంది' అంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఏమిటో ఆ మనిషి స్వభావం అనుకున్నాను.

'ఇప్పుడు మీరు వెళ్లలేరండి, నేను చెపుతున్నాగా. నా కిది

కొత్త కనకనా! ఎన్నేళ్లఒట్టి చూస్తున్నాను, సాయంత్రం వెళ్లొచ్చు....' మంగమ్మ తన పనులేమిటో చేసుకుంటూనే, చెప్పుకుంటూ పోతోంది.

ఒంట్రు నీళ్లు వేడిచేసి తీసుకొచ్చింది, ఓ గ్లాసునిండా 'కాఫీ తాగ' మంటూ.

'దీంట్లో పంచదారన్నా వేశారా' అన్నాను.

'కాఫీలో పంచదార వెయ్యరటయ్యా ఒట్టి అమాయకుడిలాగ వున్నావే' అంటూ నా వైపు చూసింది.

ఎవరో యిద్దరు పిల్లలు నేనున్న స్టోరు రూముకు వస్తున్నారు, వెళుతున్నారు, ఏవేమిటో తీసుకుపోతున్నారు. ఏదైనా గది ఖాళీ అవుతుందేమో, కాస్త కునుకు తీద్దామనుకుంటున్నాను. ఆ యోగ్యతేమీ కనిపించటంలేదు. స్టోరు రూమును ఆనుకునే యింకో గది వున్నది. ఆ గది వాలకం చూస్తే, మంగమ్మదై వుండాలనుకున్నాను. తలుపు తీస్తుంది. మళ్ళీ వేస్తుంది. ఆ యింట్లో మంగమ్మ బాణంలాగ దూసుకు పోతోంది. ఎప్పుడొస్తుందో, యెక్కడికి వస్తుందో యెవ్వరికీ తెలీదు. ఇట్టే వస్తుంది. అట్టే వెళుతుంది. ఆ పని చేస్తుంది. ఈ పని చేస్తుంది. మధ్యలో చెణుకులు విసురుతుంది,

'నువ్వు ఆ స్టోరు రూములో అంటిపెట్టుకుని కూర్చుంటే యెట్లాగయ్యా? భోజనం వేళవంగానే పిలుస్తాన్లే, వాకిట్లో అరుగుమీద కూర్చోరాదూ! కాస్త చనువిస్తేసరి, మీదకెక్కుతారు. అందుకనే యిక్కడికి యెవ్వరినీ రానీయను....' బడబడా అంటూనే మంగమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

నాకు చెడ్డ కోపంవచ్చింది. చెర్రుమన్నాను. చివాలున లేచాను. మొహం చిటచిట లాడించుకుంటూ గదిబైటకు వచ్చాను.

ఎప్పుడు వచ్చిందో వచ్చేసింది మంగమ్మ. నా యెదురుగానే నిలబడివుంది.

'ఏమండీ కాస్త అరుగుమీదకు వెళతారూ. మా అమ్మాయి చిన్న బట్ట కట్టుకుని యిటు వెళ్ళటానికి సిగ్గుపడుతోంది. మళ్ళీ యిప్పుడే ఎదురుగాన్లేండి!........ఏమిటే అమ్మా, యీ సిగ్గు........బట్టకట్టుకునే వున్నావుగా, చప్పున పోవటానికి యేమిటలా వెనకా ముందు చూస్తున్నావు....' మంగమ్మ అంది.

నేను వెళ్ళబోతుండగానే, ఆ అమ్మాయి తడి బట్టలతో శరీరం అటూ యిటూ కదిలించుకుంటూ, మధ్య మధ్య వంగుతూ అటూ యిటూ బిత్తరుచూపులు చూసుకుంటూ ఆ గదిలోకి తుర్రుమన్నది.

'వాళ్లమ్మాయండి వాళ్లమ్మాయి....' అన్నాడు ఒకాయన. నా వంక వ్యంగ్యంగా చూస్తూ నవ్వుతూ.

'తెలుసు తెలుసు' అన్నాను.

'ఏ వేళయిందే ఏ వేళయింది చెప్పు. ఈ శృంగారం యిప్పటి నుంచి యెందుకే. నీకేమన్నా మతిపోయిందా?....' మంగమ్మ ఓ కోరచూపు చూసి వెళ్ళిపోయింది.

'నీ బెడ్డింగులో యేమైనా ఖరీదుగల వస్తువులున్నాయా. అయినా నీ చాక్కా గదిలో పెట్టేవచ్చావా! అవుతే దాంతో యింక నీకేం పని లేదన్నమాట....' అన్నాడు ఒకతను నా వైపు దర్జాగా చూస్తూ.

'ఏం అక్కడ పెడితే!....' అన్నాను.

'ఏం ఏమిటయ్యా! మంగమ్మ ఒట్టి దొంగ మనిషి. ఏదుంటే అది కాజేస్తుంది....పైకి అట్లా మాట్లాడుతుందిగాని ఒట్టి దొంగది.... అదుగో యిటే వస్తున్నట్టున్నది,' అన్నాడు.

'అబ్బ! ఏం కోపాలయ్యా, నేను నిన్ను వాకిట్లో కూర్చో మన్నానే అనుకో, కూర్చోవటమే! అయినా మా అమ్మాయి వెళ్ళి యెంత సేపయింది! లోపలికిరా' అంది మంగమ్మ.

నేను అడుగులు చప్పుడులేకుండా వెనకాలే గదిలోకివెళ్లి త్వర త్వరగా బెడ్డింగు చుట్టేసి, చొక్కా చేతులోకి తీసుకున్నాను. అమాంతం మంగమ్మ వచ్చేసింది.

'ఇదిగో యిటురండి. మీతో ఓమాట. వాకిట్లో మీరు యెవ రితో మాట్లాడుతున్నారో తెలుసా!.... పచ్చిరౌడి, ఒట్టి దొంగవెధవ. ఏదందుతే అది పట్టుకు వెళ్లిపోతాడు. ఆ ఎదురుగదిలో వుంటాడు. వెళ్లిపొమ్మంటే వెళ్లడు. కాస్త జాగ్రత్తగా వుండండి బాబు. తీరా మాయింటికి వచ్చిన తర్వాత, మీది వూచికపుల్లపోయినా మా ప్రాణం చివుక్కుమంటుంది. తర్వాత మీయిష్టం....' మంగమ్మ అప్పటికే గంతేసింది.

మెల్లిగా చొక్కా మళ్ళీ చిలుకకొయ్యకు తగిలించాను. ముడిచిన బెడ్డింగు కూర్చుని మెల్లిగా విప్పుతున్నాను.

'ఏమండీ....' వెనకాలే నవ్వులు వినిపించినాయి. చప్పున వెనక్కు తిరిగి చూశాను.

మంగమ్మ కూతురు. తడిబట్టలతో వెళుతవున్నప్పుడు చూసిన మంగమ్మకూతురే!

'ఇదిగో తాళం, తాళంచెవి, ఆ మూలగది ఖాళీఅయింది. మిమ్మ ల్ని అక్కడ వుండమని మాఅమ్మ చెప్పింది'. నా చేతికి అందిచ్చి పిటుగా వెళ్లిపోయింది.

బెడ్డింగు చంకనపెట్టుకుని గదిలోకి వెళ్లేటప్పటికి, పనిచేసేది గదియింకా వూడుస్తూనే వుంది. చప్పున నన్ను చూసి చేతిలో బెడ్డింగు అందుకుని లోపలపెట్టింది.

'రండి బాబుగారు' అన్నది.

'అయ్యో మీదేవూరు?....'

'నాదా?....' ఆశ్చర్యంగా పనిచేసే దాసివైపుకు తిరిగాను.

'అవునండీ మీదే! మిమ్మల్ని యెక్కడో చూసినట్టు వుందండి....'

'....ఎవర్ని చూసి యెవర్నమకున్నావో, తొందరగా కాఫీ....' చివరగావున్న కుర్చీలోకివెళ్లి కూర్చున్నాను విసురుగా.

'అయ్యగారూ! మెల్లిగారండీ....ఆ కుర్చీకి మూడుకాళ్లేనండి. అందుకనే అమ్మగారు గోడకు ఆనిచ్చిపెట్టారు....' అన్నది నవ్వుతూ.

పనిచేసేది నిష్క్రమించగానే, మంగమ్మకూతురు చివాలున వచ్చింది.

'ఇదిగో మీ జేబురుమాల అక్కడ పడిపోయింది....పనిచేసేది యేమన్నా అడిగిందా? అది ఇక్కడకు వచ్చినవాళ్లందర్నీ అలాగే అడుగుతుందిలెండి .... ఊహు .... హు' అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

నేను గది గుమ్మందాకా చప్పున వెళ్లి, పిగ్నలుదగ్గర రైలు ఆగి పోయినట్లు నిలబడిపోయాను.

'ఒరే ముత్యాలు! ఓముత్యాలు....ఎక్కడ చచ్చావురా, ఆసావిడి వూడవరా అంటే....సులోచన యెక్కడకు పోయింది. పనున్నప్పుడే అందరూ మాయమైపోతారు....బాలకోటిదగ్గర వుందేమో చూసిరా....' మంగమ్మ తీవ్రంగా నా గదిలోకి వచ్చేసి 'ఏంనాయనా. యీ గది బాగుందా? ఏదో పల్లెటూరి వాళ్లం. బస్తీ సౌకర్యాలు ఇక్కడ కావా లంటే ఎట్టా దొరుకుతాయి నాయనా?' నడిచిపోయింది.

'విస్తళ్లెయ్యరా, విస్తళ్లెయ్యి. ఏమిటి దిక్కులు చూస్తున్నావ్ ... పనులు చురుకుగా కానీండి....ఒసేయ్ అమ్మాయీ! అలా నుంచుంటే పనవుతాయిటే! ఆ!....ఎవరిస్తట్లో వాళ్లొచ్చి కూర్చోండయ్యా!....

'అమ్మగారు అట్లాగే అంటారులెండి. మీరొచ్చి విస్తరిముందు కూర్చోండి' నన్నుచూసి ముత్యాలు నవ్వాడు. సులోచన నవ్వింది. నలుగురూ నవ్వారు. మంగమ్మ కూతురు నవ్వింది. నేను నవ్వాను.

'కల్తీలేని నెయ్యి. కాస్తంత వేయించుకో....ఏమిటే అవడన? చెంగులు ఓమూల విస్తట్లోనే వేలాడుతున్నాయి, కాస్త పైకిదోపుకుంటే యేం!....కట్టయ్యగారు పప్పందుకోండి....' మంగమ్మ ఒక్క చూపుతో బారునంతా కనుక్కుంది.

వడ్డన చురుకులో భోజనాలు ఇట్టే అయిపోయినాయి. గదిలోకి వెళ్లి పడుకున్నాను. తలుపు ఓరగా వేసివుంచాను. తలుపుదగ్గరగా ఎవరో నుంచున్నట్టుగా అనుమానం వేసింది 'ఎవరూ' అన్నాను.

'నేనేనండి కట్టయ్యనండి....మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుగా

వుంది. జ్ఞాపకం రావట్లేదు. ఎక్కడా అని ఆలోచిస్తున్నాను.'

'నన్నా ! నువ్వు చూశావా ! చూసే వుంటావులేగాని.... కాసేపు పడుకోనీ....' అటువైపుకు వత్తిగిలాను.

తలుపు లాగి కట్టయ్య వెళ్లిపోయినట్లున్నాడు. ఇట్టే నిద్ర వచ్చేసింది. రాత్రికూడా నిద్రలేదట. బండ నిద్ర పట్టింది. ఏమిటో లీలగా మాటలు వినిపిస్తున్నాయి. నిద్రలో కాలగమనం తెలీదు.

కళ్ళు తుడుచుకుంటూ లేస్తూనే వున్నాను. బాలకోటి తలుపు తోసుకుని వచ్చాడు.

'మీరు నిద్ర పోతున్నారుగదా అని లేప లేదు. ఆ కట్టయ్యను లోపలికి యెందుకు రానిచ్చారు. అంత నిద్ర వస్తుంటే తలుపు ఘడియ వేసుకుని పడుకోక పోయారా ? పచ్చి దొంగండి. దొంగ, ఏ వస్తువు బైట పెట్టుకోవటానికీ ఆస్కారంలేదు. ఇట్టే మాయమై పోతుంది. కాస్త జాగ్రత్తగా వుండండి....' హెచ్చరికచేసి వెళ్ళి పోయాడు.

"మా అమ్మ కాఫీ యిస్తుందిట లోపలికి రమ్మంటోంది...." మంగమ్మ కూతురు కబురుచెప్పి వెళ్ళిపోయింది.

అక్కడకు వెళితేగదా కాఫీ యిచ్చేది అని మెదలకండా వూరుకున్నాను.

పొద్దు వాలుతోంది. సులోచన చీపురుకట్ట పట్టుకునివచ్చి ఊడుస్తోంది. గది గుమ్మం దగ్గర నిలబడ్డాను. 'అయ్యగారు, అయ్యగారు' అంటూ లోపల్నుంచి పిలుపులు వినపడ్డాయి.

'ఏమిటి ఊడవటంకాలా యింకా ?' అన్నాను విసుగ్గా.

'అయ్యగారు, ఓ మాట,' అన్నది. యెంతో సాహసంగా నేను లోపలికి వెళ్ళాను.

'మీరు కొత్తారు కాబట్టి చెపుతున్నా. ఆశ మంచిదికాదు. కాస్త ఆగుతే మీకే తెలుస్తుంది....హి....హి....' అంటూ వెనక్కు తిరిగింది.

'ఆశేమిటి....' గట్టిగా కసిరాను.

" ఆశమ్మగారండి. పెద్దమ్మగారి కూతురు." సులోచన ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది.

చొక్కా తొడుక్కున్నాను. చెప్పులు వేసుకుంటూ జేబులోకి మామూలుగానే చేతిని పోనిచ్చాను. ఏది మనీపర్సేది! రెండో జేబులోకి ఆదుర్దాగా చేతిని పోనిచ్చాను. ఎంతో గాభరా వేసింది. మనీపర్సు లేదు. తత్తరబిత్తరగా అటూ యిటూ తడిమి చూశాను. బెడ్డింగు మడతలోవుంది. ఇప్పుడేగా జేబులోంచి తీసిపెట్టింది. అప్పుడే అంతలోకీ మరిచిపోయాను. గది తాళం వేశాను. ఇప్పుడే వస్తానంటూ బజారుకు బయలుదేరాను.

ఆ వూళ్ళో ఓ చిన్న గ్రంథాలయం వుంది. దానికి ఆనుకునే ఓ గుడి వున్నది. మండపంమీద యెక్కి ఏమిటో ఆలోచిస్తున్నా. ఆలోచిస్తూనే మనీపర్సు తీశాను. మనీపర్సు తెరిచి చూస్తున్నాను. మూడు నయా పైసలు అట్లాగే వున్నాయి. నోట్లు కాస్తా మాయమయి పోయినాయి. గుండె ఆగినంత పనయింది. సరాసరి యింటికి వెళ్ళాను. 'మంగమ్మగారు, మంగమ్మగారు ' అని బిగ్గరగా పిలిచాను.

" ఏమిటి నాయనా ? అన్నది మంగమ్మ ఆప్యాయంగా. 'నా పర్సులో డబ్బు పోయిందండీ,' అన్నాను ఆదుర్దాగా.

'మా పనిచేసేదానికి చేతి దుడుకుతనం వుంది నాయనా! నేను చెప్పుదామనుకుంటూనే మరిచేపోయాను. ఎన్నెన్ని జ్ఞాపకం వుంటాయి కనక! అది డబ్బు తీంస్తుటే నేను పట్టుకుని చివాట్లుపెట్టి పంపించా.

నువ్వు బజారు వెళుతున్నట్టే నాకు తెలీదు. లేకపోతే అప్పుడే యిచ్చి వుందును. ఇదిగో నాయనా నీ డబ్బు లెక్క పెట్టుకో నాయనా. ఆ బొత్తి, బొత్తి భద్రంగా దాచివుంచా....' మంగమ్మ నా వైపుకే చూస్తూ రెండు క్షణాలు నిలబడింది.

'పది, పదిహేను రూపాయలు తగ్గినాయే!....'

"అయ్యో! అయ్యో! నా పిల్లమీద వట్టు నాయనా! పరాయి వాళ్ల సొమ్ము తిని నేను బాగుపడతానా! నీ డబ్బు తీసుకున్నవాళ్లు నాశనం అయిపోతారు...."

'నేను మిమ్మన్నేమీ అనలేదే ....'

'ఇంకా పేరుపెట్టి అనాలేమిటి! డబ్బు తక్కువగా వుందంటే యేమిటి అర్థం. ఆ పని చేసేదాని దగ్గరతీసి మీ కివ్వటం వచ్చింది. యింతకీ అనర్థం....అసలు యీ లోకంలో మంచికి మంచి వుంది కన కనా!....' బడబడా అనేసింది మంగమ్మ.

గదిలోకి వెళ్ళాను. పెడ్డింగువిప్పి చూశాను. బట్టలన్నీ సరిగ్గానే వున్నట్టున్నాయి. అయితే కొత్త తుండుగుడ్డ తెచ్చానా లేదాఅని అనుమానంగావుంది. ఏమయితేనేం అది కనిపించటంలేదు. మధ్యాహ్నంనుంచి ఎండ ఫెళ్లున కాయటంవలన ఉక్కపోతోంది. అంత పెద్ద వర్షం కురిసి మళ్లా ఎండవచ్చి పడేటప్పటికి ఆ యిల్లంతా అదో రకం వాసనగావుంది. ఆగదిలో పడుకునేటట్టు కనిపించటంలేదు. పోసి

ఆరుబైట ఏ చాపన్నా వేసుకుని పడుకుందామా అంటే, మనడబ్బు మనకుంటుందో వుండదో అని అనుమానం. ఈ సందిగ్ధావస్థలో సత మతమవుతున్నాను. తలుపు తాళంవేసి వాకిట్లో అరుగుమీదకు వచ్చి కూర్చున్నాను.

అరుగుచివర ఒకమ్మాయి కూర్చుని ఖంగుఖంగున దగ్గుతోంది. ఇంత మంచినీళ్లు తెచ్చియిచ్చేదిక్కు కూడా కనిపించటంలేదు. చూస్తూ చూస్తూ అక్కడ కూర్చోబుద్ధి పుట్టలేదు. గిర్రున తిరిగి వాకిట్లోకి వెళ్లి పోయాను. ఆకాస్త వూర్లోయెంతసేపు యెట్లాతిరిగినా, మళ్లి మంగమ్మ పూటకూళ్ల యిల్లే కనిపిస్తోంది. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, యిద్దరు ఆడవాళ్లు గబగబ ఆయింట్లోకి ప్రవేశించారు. ప్రొద్దున్నించే నాకు యెక్కడా తగల్లేదే అనుకున్నాను. నేను యింట్లో అడుగుపెట్టానో లేదో, మంగమ్మ యెదురుగావచ్చి నిలబడింది.

'చూశావయ్య, చూశావా! యిదిగో అయిదు రూపాయల నోటు స్టోరు రూములో బియ్యపుబస్తాకింద పడింది. నువ్వేమొ యెక్కడ పడితె అక్కడ డబ్బు పారేసుకుంటావు, మమ్మల్నేమొ దొంగలంటావు', మంగమ్మ నోటు అందిచ్చింది.

నేను మెదలకండా తీసుకుని జేబులో పెట్టుకున్నాను. చీకట్లో అప్పుడప్పుడే సాగుతున్నాయి. అంత మండువా కొంపలోనూ మధ్యలో బిక్కుబిక్కుమంటూ ఓలాంతరు వెలిగించి పెట్టింది. దానివెలుతురు ఆ గ్లాసుమసిలోపనే వుండిపోయింది. నేను గదిలోకి వెళ్లాలన్నా, బైటకు రావాలన్నా, ప్రాణాంతకంగా వుంది. ఈ చీకట్లలో యెవరు యెట్లా తారసిల్లుతారో అని యెవరిగదిలో వాళ్ళు ఓబెడ్ లైటుపెట్టు కున్నట్టున్నారు, ఇంకా నాగది అంధకారంగానే వుంది.

"మంగమ్మగారూ" అని పిలవటానికి నావళ్లు గలతరిస్తోంది.

బాలకోటిగదిలో కూర్చుని, దీపం ముందర నవ్వుకుంటున్నాడు నాకు కనిపించనివ్యక్తి ఆగదిలో యెవరో వుండివుండాలని అనుకుంటు న్నాను. ఆయన దగ్గరకు వెళ్లి దీపంసంగతి అడుగుదామను కుంటు న్నాను. మళ్లా వస్తాయిస్తున్నాను, కాసేపు కూర్చుంటె యెవరైనా తెచ్చి యిస్తారేమో చూద్దామనుకుంటే యీలోపల యేతేలో అంటవోడిస్తే, వున్నది వుండగా, యిదొకటి తెచ్చిపెట్టుకున్న వాళ్లం అవుతామని, అటూ యిటూ చూసి ఆ మండువాలో లాంతరు మెల్లగా పైకి తీశాను. నా గదివైపు అడుగు వేశానోలేదో వెనకాల్నుంచే వచ్చేసి, 'యిది యిక్కడ పెట్టండి మీకు వేరే దీపం యిస్తాం' అన్నది ఒకమ్మాయి, నా చేతిలోంచి లాంతరు తీసుకుంటూ, నా గుండె ఝల్లుమన్నది. ఇంత లోకే ఆశ ఓ దీపం పుచ్చుకుని నా గదిలోచి వచ్చింది. కిటికీలో దీపం పెట్టింది. నేను గది గుమ్మం దగ్గర నిలబడ్డాను. ఎంత సేపటికి లోపల్నుంచి బైటకు రాదే! బైటకు రమ్మనమని పిలవటం యెట్లా! అట్లా కాదని నేను లోపలికి పోవటం యెట్లా!

'దీపం పెట్టావుగా' అన్నాను అక్కసుగా.

'పెట్టా'నంది. తర్వాత మాట్లాడాలసింది నేనేగా!

'ఏం చేస్తున్నావు లోపల!' అన్నాను.

'మా అమ్మ నీతో మాట్లాడమంది....'

'మీ అమ్మను పిల్చుకురా....' గట్టిగా గద్దించాను.

'మా అమ్మ కాదు! నేనే!....' ఆశ నవ్వింది.

నా వళ్లు మండింది. చరచర వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నాను.

ఇద్దరు ఆడ పిల్లలు విడ్డూరంగా చూస్తున్నారు. వాళ్ళ దృష్టిలోంచి తప్పించుకుని వాకిట్లోకి వెళ్లాను. సులోచన నిలబడివుంది. నదురూ బెదురూ లేకండా నా వంకే చూస్తోంది. సులోచనను చూస్తుంటే, డబ్బు నిజంగా యెత్తుకు పోయిందా అనిపించింది. ఏమీ అనలేకపోయాను.

'అయ్యగారూ!....' అన్నది.

'ఏం కావాలి!....'

'ఇవ్వాళ యింట్లో యేంలేవండి!.... మరి మీ గది నేను వూడవ టంలా!....' నవ్వింది సులోచన.

ముత్యాలు, బాలకోటి నలుగుర్ని వెంటపెట్టుకుని గబగబ వస్తున్నారు. సులోచన యెక్కడికి వెళ్ళిందో యిట్టే మాయమై పోయింది. కొంత మంది భోజనంచేసి వెళ్ళిపోతున్నారు. మరి కొంత మంది భోజనానికి వస్తున్నారు.

'డబ్బులు, మా అమ్మాయికి యిచ్చి పొండయ్యా....' అరుస్తోంది మంగమ్మ.

ఆశ డబ్బులు వసూలు చేస్తూ నిలబడింది. కొంటెగా ఆశతో సరసాలాడుతున్నారు. ఆశ జడ లాగాడు ఒకతను; ఆశా అని మీద మీదకు వచ్చాడు.

'ఎంత డబ్బివ్వాలేమిటి' అన్నాను ఆశతో నెమ్మదిగా.

'మా అమ్మను కనుక్కొస్తా, మా అమ్మను కనుక్కొస్తా' అంటూ లోపలికి వెళ్ళింది.

ఏమని చెప్పిందో యేమో ! మంగమ్మ వస్తూనే 'మీబోటివాళ్ళ కనికరం వుండాలిగాని, యెంత యిస్తే మాత్రం యేం అసలు యివ్వక పోతే మాత్రం యేం' అన్నది యెంతో సాత్వికంగా.

'భోజనానికి, యిక్కడ వుండటానికి యెంత డబ్బయిందని అడిగాను అంతే' అన్నాను.

'ఏమే నువ్వట్లా చెప్పావేమిటే' అంటూ కూతుర్ని కసురుకుని వెళ్ళిపోయింది.

రాత్రి పది దాటిపోయింది. బెడ్డింగు తెచ్చుకుని వాకిట్లో అరుగుమీద పడుకున్నాను. ఈ రాత్రి యిక్కడనుంచి బైట పడితే పీడ విరగడయిపోతుందని.

రెండు కుక్కలు పోట్లాడుకుని అరుగుమీదికి వచ్చినాయి. ఎంత తోలినా పోవటంలేదు. మనం నిద్రపోగానే అవికూడా వచ్చి మెల్లిగా చేరతాయి. నిద్ర కను రెప్పలమీదకు వచ్చి బరువుగా కూర్చుంది. కునుకుపాట్లు పడుతున్నాను.

ఆశ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చింది. 'మా అమ్మ గదిలోకి రమ్మన్నదండి' అన్నది.

'ఎవరూ ! మీ అమ్మా' అని వులిక్కి పడ్డాను.

'నిన్ను అక్కడ పడుకోమంది....' ఆశ నవ్వింది.

'అవును నాయనా అవును. ఈ అరుగుమీద ఆడపిల్లలు పడుకుంటారు. నువ్విక్కడ వుంటే వాళ్ళు రావటానికి సిగ్గుపడుతున్నారు' అన్నది మంగమ్మ లోపల్నుంచి.

గబగబ బెడ్డింగుచుట్టి లోపలకు వెళ్లాను. నా వెనకాలే ఆశకూడా కిలకిలమంటూ వస్తోంది. నా గది గుమ్మం ముందర ఆపేసి, గభాలున లోపల ఘడియవేసుకున్నాను. దీపం నూనెంతా పీల్చేసి తైతక్క లాడు తోంది. వత్తి పెద్దదిచేశాను. అయితే దీపం పెద్దది కావటలేదు. ఈ అంధకారంలోకి వచ్చిపడ్డానేమా అనుకుంటున్నాను. కిటికీలోంచి రివ్వున గాలొస్తోంది. ఉండి ఉండి గప్పుమంది దీపం. గదిలో ఓ మూలగా బుస్సుమంది నిప్పుపుల్ల వెలుతురు ఒక్క క్షణంలో గదంతా నిండిపోయింది. నా గుండె ఝల్లుమన్నది. వళ్ళంతా వణికిపోతోంది. పెదిమలు తడబడుతున్నాయి. వస్తోంది నా వైపుకే వెలిగించిన నిప్పు పుల్ల పట్టుకుని, అసలే దయ్యాలంటే భయం. అందులో ఆడ దయ్యం అంటే మరీ భయం. ఇదెక్కడ నాకు దాపరించిందిరా అని గజగజలాడి పోతున్నాను. దగ్గరగావచ్చి యింకో నిప్పు పుల్ల వెలిగించింది. వెలు తుర్లో మొహం చటుక్కున కనిపించింది, పోల్చుకున్నాను. అబ్బ గుండెదడ అప్పటికీ తగ్గలేదు. ఏమిటా సాహసం అనిపించింది.

అప్పుడేం చేశేటట్టు! తలుపు తీద్దామా ఆశ పట్టుకుంటుంది. అట్లాగే వుందామా సులోచన నా గదిలో, అందులో రాత్రిపూట ఎవ్వరికీ తెలియకండా! ఎట్లా ఆ రాత్రి గడపటం. కల్లు అనుకునే వాళ్ళందరికి పాలుపాలు అని యేమని రుజువు చేసుకుపోతాం. ఎట్లాగు నమ్మించటం! గట్టిగా కన్ను మూసుకుని నిద్ర పోదాం అనుకుంటే యివొచ్చి పడ్డాయి. నాకు తెలీక యీ బురదలోకి వచ్చాను, ఎట్లాగు తప్పించుకు పోవటం?

బెడ్డింగుచుట్టి, పర్సుకోసం జేబు తడుముకున్నాను. హఠాత్తుగా జ్ఞాపకం రావటంవలన, పర్సు కనపడలేదు. గాభరాగా అటూ యిటూ చూశాను, ఎవర్నని అడిగేటట్టు. అందరూ దొరలేను! అర్ధ రాత్రివరకు కన్నుమూయకండా అట్లాగే కూర్చుని, సులోచనను బ్రతిమాలుకున్నాను,

'ఈ రాత్రికి రాత్రే యెక్కడికైనా వెళ్ళిపోయి, యే చెట్టు క్రిందో పడు కుంటాను.' అని. సులోచన యేమీ అభ్యంతరం చెప్పలేదు పైగా సహాయం చేసిందికూడా. 'ఈ దొడ్డి దోవనపోతే యెవ్వరూ కనిపించరు. వాకిటి తలుపు కనక తీస్తే, యే కిర్రుమని చప్పుడయినా యెవరైనా లేవొచ్చు.' అన్నది. మెల్లిగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మనస్సులో సులోచన మంచితనానికి కృతజ్ఞత తెలుపుకున్నాను. మెల్లిగా జారుకున్నాను. గది దాటాను. వంటింటి ఎదురుగావున్న తడిక హద్దులుకూడా దాటి మెల్లిగా ముందుకు వెళుతూ, యెందుకో ఓసారి సులోచనను చూడాలనిపించింది. వెనక్కి తిరిగి చూశాను మనో నేత్రంతో, ముందుకు అడుగు వెయ్యబోతున్నాను. 'ఎక్కడికి యీ అర్ధరాత్రి ప్రయాణం?' అన్నది ఆశ ఎదురుగా వచ్చి.

( ఆంధ్ర సచిత్ర వార పత్రిక. 1–4–1959 )

---